**మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు**



సిద్దిపేట అర్బన్: పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)



మెదక్ మున్సిపాలిటీ: ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

# పదికి సమాయత్తం



- సిద్దిపేట జిల్లాలో పరీక్ష రాయనున్న 13,987 విద్యార్థులు
- ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ
- గతేడాది పది ఫలితాల్లో జిల్లాకు రెండో స్థానం
- సిలబస్ పూర్తి.. రివిజన్ ప్రారంభం
- మొదటి స్థానం సాధించడమే లక్ష్యం: డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, జనవరి 3: పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సమాయత్తం అవుతున్నారు. మార్చిలో పదో తరగతి పరీక్షలు నిర్వహించనుండడంతో ఇప్పటి నుంచే ఒత్తిడి తట్టుకుని పరీక్షలు రాసేలా విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా గతేడాది స్వల్ప తేడాతో మొదటి స్థానాన్ని కోల్పోయింది. రెండో స్థానం సాధించింది. ఈ సంవత్సరం రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానం రావడానికి విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో 100 శాతం సిలబస్ పూర్తి చేసి, రివిజన్ ప్రారంభించినట్లు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మార్చి 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండగా.. ఏప్రిల్ 2వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను విద్యాశాఖ అధికారులు ఇప్పటికే విడుదల చేశారు.

### సిద్దిపేట జిల్లాలో 13,987 మంది విద్యార్థులు

సిద్దిపేట జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 13,987 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఇందులో 7,036 మంది బాలురు, 6,951 మంది బాలికలు ఉన్నారు. వీరితో పాటు 1,661 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇందులో 790 మంది బాలురు, 871 మంది బాలికలు ఉన్నారు. పదో తరగతి పరీక్షల కోసం సిద్దిపేట జిల్లాలో 80 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు విద్యా శాఖ అధికారులు వెల్లడించారు. గతేడాది 14,186 మంది రెగ్యులర్ విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా.. 84 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

### మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇప్పటికే విద్యాశాఖ విడుదల చేసింది. 2024 మార్చి 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. మొత్తం ఆరు పేపర్‌లకు గానూ ఏడు రోజుల పాటు పరీక్షలు జరగనున్నాయి. మార్చి 18న ఫస్ట్ లాంగ్వేజీ, 19న సెకండ్ లాంగ్వేజ్, 21న థర్డ్ లాంగ్వేజ్, 23న గణితం, 26న ఫిజికల్ సైన్స్, 28న బయో సైన్స్, 30న సోషల్ స్టడీస్ పరీక్షలు జరగనున్నాయి. ప్రధాన పరీక్షలు మార్చి 30తో ముగియనున్నాయి. కాగా ఏప్రిల్ 1, 2 తేదీల్లో ఒకేషనల్ పరీక్షలు జరగనున్నాయి. సైన్స్‌లో రెండు సబ్జెక్టులు మినహా మిగతా ఐదు పేపర్లకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఫిజికల్ సైన్స్, బయోసైన్స్ పేపర్లు ఉదయం 9.30 నుంచి ఉదయం 11 గంటల వరకు జరగనున్నాయి.

### గతేడాది జిల్లాకు రెండో స్థానం

సిద్దిపేట జిల్లా కొన్నేండ్లుగా పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నది. మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో సిద్దిపేట జిల్లా 2023లో రాష్ట్రంలో రెండో స్థానం సాధించింది. 2022లో మొదటి స్థానం సాధించింది. ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను సమన్వయం చేస్తూ, తగు సూచనలు, సలహాలు ఇస్తూ మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్‌రావు విద్యార్థుకు మనోధైర్యాన్ని కల్పిస్తున్నారు. 2023లో 98.65 ఉత్తీర్ణత శాతంతో రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ఉత్తీర్ణత శాతం పెరిగనప్పటికీ స్వల్ప తేడాతో గతేడాది సిద్దిపేట జిల్లా మొదటి స్థానాన్ని మిస్సైంది. మళ్లీ ఈ సంవత్సరం ప్రథమ స్థానం సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నట్లు విద్యాధికారులు వెల్లడించారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు అధికారులు తెలిపారు.

### మొదటి స్థానం సాధించడమే లక్ష్యం..



సిద్దిపేట జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఇప్పటికే పదో తరగతి సిలబస్ పూర్తయ్యింది. నవంబర్ 1వ తేదీ నుంచి ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు గంట పాటు ప్రత్యేక తరగతులు ప్రారంభించాం. జనవరి 2 నుంచి సాయంత్రం పూట ఒక గంట పాటు ప్రత్యేక తరగతులు ప్రారంభించాం. సిద్దిపేట జిల్లా మళ్లీ మొదటి స్థానం వచ్చేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో కృషి చేస్తున్నాం. తప్పకుండా ఈసారి కూడా మంచి ఫలితాలు సాధిస్తాం.

*– శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో, సిద్దిపేట*

## పదికి సన్నద్ధం..

- ప్రభుత్వ బడుల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ కసరత్తు
- ఉత్తమ ఫలితాలు సాధించేలా కార్యాచరణ
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- ఈ నెలలో మొత్తం సిలబస్ పూర్తి చేసేలా చర్యలు
- గతేడాది రాష్ట్రంలో మెదక్‌కు 13వ స్థానం
- ఈ ఏడాది పరీక్షలకు హాజరుకానున్న 9,500 మంది విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 3: పదో తరగతి వార్షిక ఫలితాలను మెరుగుపరచడంతో పాటు వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా మెదక్ జిల్లా విద్యా శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి నవంబర్ 4 నుంచి మార్చి 10 వరకు సబ్జెక్టుల వారీగా స్పెషల్ తరగతులు నిర్వహిస్తూ నైపుణ్యాన్ని పెంచి ఉత్తమ ఫలితాలు, అత్యధిక మార్కులు సాధించేలా కృషి చేస్తున్నది. డిసెంబర్ మాసం నాటికి 70 శాతానికి పైగా సిలబస్ పూర్తి కాగా, ఈ నెలాఖరు వరకు వంద శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నది. గత విద్యా సంవత్సరం ఫలితాల్లో 90.84 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో జిల్లా 13వ స్థానంలో నిలువగా, ఈసారి ఉత్తీర్ణత శాతం మరింత పెంచేందుకు అధికారులు విశేషంగా కృషి చేస్తున్నారు.

### ప్రత్యేక తరగతులు..

ప్రభుత్వ పాఠశాలల్లో నవంబర్ 4వ తేది నుంచి మార్చి 10 వరకు రోజుకో సబ్జెక్టులో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ప్రస్తుతం, ఉదయం 8.30 గంటల నుంచి 9.30 వరకు కొనసాగుతున్న తరగతులను జనవరి 18 నుంచి సాయంత్రం 4.45 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు. వంద శాతం మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్స్ ఇస్తూ రోజూ వారీ స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ప్రతి శనివారం ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు అన్ని సబ్జెక్టులపై ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి నెలలో సబ్జెక్టుల వారీగా ప్రీ ఫైనల్ పరీక్షలు చేపట్టనున్నారు. ఈ ఏడాది జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సంబంధించి 9,500 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

### వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకత శ్రద్ధ



వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. సబ్జెక్టుల వారీగా అనుమానాలను నివృత్తి చేసుకుంటూ ముందుకెళ్తున్నాం. సిలబస్ ప్రకారం బోధిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం. ఈ నెలలోనే సిలబస్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈసారి వంద శాతం ఫలితాలు, 10 జీపీఏ సాధించాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించాం. తల్లిదండ్రులు సైతం విద్యార్థులపై దృష్టి సారించాలి.

*– రాధాకిషన్, జిల్లా విద్యాధికారి, మెదక్*



మెదక్‌లో ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

# గుడ్డు గుటకాయ స్వాహా!

## మద్దూరు మోడల్ స్కూల్‌లో అందని పౌష్టికాహారం

- నెలరోజులుగా సరఫరాను నిలిపివేసిన కాంట్రాక్టర్
- లోపించిన జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ



మద్దూరు మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్ భవనం




హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థినులు

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 3: పేద విద్యార్థులకు పౌష్టకాహారాన్ని అందించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాల్లో కోడిగుడ్లు, చికెన్, మటన్‌ను అందిస్తున్నది. అధికారులు, కాంట్రాక్టర్ల చర్యలతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతున్నది. సిద్దిపేట జిల్లా మద్దూరు మోడల్ స్కూల్‌కు చెందిన బాలికల హాస్టల్‌లో 49మంది విద్యార్థినులున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం సోమ, మంగళ, గురు, శుక్రవారాల్లో కోడిగుడ్లు అందించాలి. 1, 3, 5వ ఆదివారాల్లో చికెన్, 2, 4 ఆదివారాల్లో మటన్ అందించాలి. ఈ హాస్టల్‌లో నెల రోజులుగా విద్యార్థులకు కోడిగుడ్లు అందడం లేదు. చికెన్, మటన్ కూడా అందించడం లేదు.

### పట్టించుకోని అధికారులు

జిల్లాలోని అన్ని హాస్టళ్లకు కోడిగుడ్లు సరఫరా చేసే హక్కులను దక్కించుకున్న చేర్యాలకు చెందిన ఓ కాంట్రాక్టర్ ఇటీవల కోడిగుడ్ల ధరలు పెరుగుతుండడంతో తనకు గిట్టుబాటు కాదనే ఉద్దేశంతో హాస్టల్‌కు కోడిగుడ్ల సరఫరాను నిలిపివేశాడు. నవంబర్ 28వరకు మాత్రమే సరఫరా చేశాడు. హాస్టల్ వార్డెన్ జ్యోతి కోడిగుడ్లను ఎందుకు పంపించడం లేదని ప్రశ్నించినప్పటికీ కాంట్రాక్టర్ తనకేం పట్టదన్నట్లు వ్యవహరించాడు. దీంతో స్వయంగా వార్డెన్ డిసెంబర్‌లో తన మోపెడ్‌పై వెళ్లి 5 ట్రేలలో గుడ్లు తీసుకువచ్చి మూడు రోజులపాటు అందించారు. ఈ విషయాన్ని వార్డెన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో విద్యార్థులు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. మారుమూలన ఉన్న ఈ హాస్టల్‌లో ఏంజరిగినా ఎవరూ పట్టించుకోరనే ధీమా, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై హాస్టల్ వార్డెన్ జ్యోతిని 'నమస్తే తెలంగాణ' ఫోన్‌లో వివరణ కోరగా నెల నుంచి గుడ్లు అందడం లేదని తెలిపారు. కాంట్రాక్టర్‌కు ఎన్ని సార్లు చెప్పినా సరఫరా చేయడం లేదని వాపోయారు.

హాస్టల్ గోడకు అంటించిన మెనూ చార్ట్




# యాసంగి పనుల్లో రైతన్నలు బిజీబిజీ

## జోరుగా కొనసాగుతున్న వ్యవసాయ పనులు

- నాటేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్న కర్షకులు
- ప్రారంభంకానున్న వరి నాట్లు



ప్రజ్ఞాపూర్ సమీపంలో వరినారు

గజ్వేల్, జనవరి 3: యాసంగి పనుల్లో రైతులు బిజీబిజీగా గడుపుతున్నారు. సిద్దిపేట జిల్లావ్యాప్తంగా రైతులు నాట్లు వేసేందుకు పొలాలను దున్నుకుని సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు నారుమడులు వేసిన రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. సంక్రాంతి తరువాత వరి నాట్లు వేస్తే సకాలంలో పంట చేతికొస్తుందని, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అనుకున్న సమయానికి వరి నాట్లను వేస్తే ఫలితం బాగుంటుందని అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తున్నారు.

### వరితో పాటు ఆరు తడి పంటల సాగు

గజ్వేల్, ములుగు వ్యవసాయ డివిజన్లలో వరి నాట్లతోపాటు ఆరు తడి పంటలు సాగు చేస్తారు. ములుగు, వర్గల్, మర్కూక్ మండలాల్లోని ఆయా గ్రామాల రైతులు అధికంగా ఆరు తడి పద్ధతిలో కూరగాయ పంటలు సాగు చేస్తారు. మిగతా మండలాల్లోని రైతులు వరి, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంటలు సాగుచేస్తారు. చాలావరకు రైతులు ఇప్పటికే వరి నారు పోయడంతో నాటు వేసుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. బోరుబావుల ఆధారంగా పంటలు సాగు చేసే రైతులు ఎక్కువగా ఉంటారు. కేసీఆర్ ప్రభుత్వం ఏటా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను కూడవెల్లి, హల్దీ వాగుల్లోకి వదలడంతో రైతులు సాగు చేసిన వరి పంటకు న్యాయం చేకూరేది. గ్రామాల్లోని చెరువులు, కుంటలను ఈ నీటితో నింపేవారు. ఈ ఏడు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పిడిచేడ్‌లో పొలం దున్నుతున్న రైతు

### పెరుగుతున్న ఖర్చులు



ఏడాది వ్యవధిలోనే సాగు ఖర్చులు పెరిగాయి. గతేడాదికీ ఇప్పటికీ చూస్తే సాగులో ఖర్చు పదిశాతం పెరిగింది. గతంలో ఎకరం పొలం దున్నేందుకు ట్రాక్టర్‌కు రూ.3 వేల నుంచి రూ.3500 వరకు తీసుకునేవారు. వరి నాటేందుకు కూలీ ఒక్కరికి రూ.500 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇక ఎకరం గుత్తా చొప్పున రూ.5 వేల నుంచి రూ.6వేల వరకు ఖర్చు అవుతున్నది. కూలీల కొరత కారణంగా చాలావరకు గ్రామాల నుంచి ఆటోల్లో తీసుకెళ్లాల్సి వస్తున్నది. ఇక గ్రామాల్లో ఒకరి తరువాత మరొకరి పొలం నాటు వేసేందుకు ఒప్పందాలు చేసుకుంటారు. కొద్ది రోజుల్లోనే వరినాట్ల ప్రక్రియ ప్రారంభం కానుండడంతో కూలీలకు డిమాండ్ బాగానే ఉంటుంది.

# ఆధునిక యంత్రాల వైపు రైతుల చూపు!

## మార్కెట్‌లోకి కోతలు కోసే యంత్రాలు

- రెండు, మూడు గంటల్లోనే ధాన్యం ఫ్యాక్టరీలకు తరలింపు
- ఇటీవల నిజాంసాగర్ ప్రాంతంలో చెరుకు నరికిన ఆధునిక యంత్రం
- పనులు త్వరగా జరుగుతున్నాయంటున్న అన్నదాతలు

**తప్పిన కూలీల కొరత... రైతులకు తగ్గిన పనిభారం**

రుక్మాపూర్ గ్రామ సమీపంలోని పొలంలో చెరుకును నరికివేస్తున్న ఆధునిక యంత్రం



న్యాల్‌కల్, జనవరి 3: ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రావడంతో వ్యవసాయం చేసే రైతులకు పనిభారం తగ్గడంతోపాటు వ్యవసాయం చేయడం సులభతరం అవుతున్నది. వ్యవసాయం చేస్తున్న రైతులకు విత్తనాలు విత్తడం నుంచి కోతలు కోసే సమయంలో కూలీల కొరతతో ఇబ్బందులు తప్పడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే మార్కెట్‌లోకి పలు కంపెనీలు అనేక రకాల ఆధునిక వ్యవసాయ పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చాయి. యంత్రాలతో విత్తనాలు విత్తడం నుంచి కోతలు కోస్తుండడం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులు దూరమవుతున్నాయి. మార్కెట్‌లో వరి, సోయా, శనగ, కంది, మొక్కజొన్న, జొన్న, చెరుకు పంటలను కోసే యంత్రాలు అందుబాటులోకి రైతులు వాటివైపు మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుతం మండలంలో గ్రామాల్లో అధికంగా చెరుకు కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. చెరుకును నరికేందుకు కూలీల కొరత తీవ్రంగా ఉంది. దీంతో నారాయణఖేడ్, మనూర్, కంగ్టి, కల్హేర్, పిట్లం తదితర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొచ్చి చెరుకును నరికి కర్మాగారాలకు తరలిస్తున్నారు. ఇటీవల మండలంలోని రుక్మాపూర్ గ్రామ శివారులోని ఓ రైతు పొలానికి నిజాంసాగర్ ప్రాంతంలోని మాగి షుగర్ ఫ్యాక్టరీకి చెందిన చెరుకు నరికే యంత్రాన్ని తీసుకొచ్చారు. యంత్రసాయంతో పొలంలో సాగు చేసిన చెరుకును రెండు, మూడు గంటల్లోనే నరికి ముక్కలు చేసి లారీలు, ట్రాక్టర్లలో నింపి షుగర్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న కూలీల తీవ్రత నుంచి తక్కువ సమయంతో చెరుకు నరికి కర్మాగారానికి తరలిస్తుండడంతో ఇబ్బందులు దూరమవుతాయని రైతులు అంటున్నారు. మండలంలోని ముంగి, కల్‌బేమల్, న్యాల్‌కల్, బసంతపూర్, మెటల్‌కుంట తదితర గ్రామాల్లోని పొలాల్లో సాగు చేసిన చెరుకు ఆధునిక యంత్రంతో నరికివేస్తుడంతో రైతులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.